రాబడి

మార్కెట్ పల్స్

ద్రవ్యసమీక్షపైనే..

దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాలకు దూరంగా ట్రేడ్ అవుతున్నాయి. గతకొద్ది రోజులుగా మదుపరులు పెట్టుబడులకు సంశయిస్తున్నారు. ఫలితంగా సూచీలు నష్టాలకే పరిమితం కావాల్సి వస్తున్నది. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 270.07 పాయింట్లు లేదా 0.33 శాతం పడిపోయి 81,451.01 దగ్గర నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 102.45 పాయింట్లు లేదా 0.41 శాతం కోల్పోయి 24,750.70 వద్ద స్థిరపడింది. ఈ వారం కూడా సూచీలు పడుతూలేస్తూ పయనించే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను రెండో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను ఈ నెల 4-6 తేదీల్లో నిర్వహించనున్నది. దీంతో వడ్డీరేట్లపై ఆర్బీఐ నిర్ణయాల ఆధారంగా మార్కెట్లు ట్రేడ్ అయ్యే వీలున్నదని చెప్పవచ్చు. ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా జరిగిన రెండు ద్రవ్యసమీక్షల్లో రెపోరేటును ఆర్బీఐ అర శాతం తగ్గించిన విషయం తెలిసిందే. రాబోయే ద్రవ్యసమీక్షలోనూ మరో పావు శాతం తగ్గవచ్చన్న అంచనాలున్నాయి. ఇదే జరిగితే బ్యాంకింగ్, ఆటో, రియల్టీ, ఇతరత్రా కన్జ్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు ఆకర్షణీయం కానున్నాయి. సూచీలు తిరిగి లాభాలను సంతరించుకోవచ్చు. ఇక ఎప్పట్లాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు, ముడి చమురు ధరలు దేశీయ మార్కెట్లను నిర్దేశించనున్నాయి. అయితే అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 24,300 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,000 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. కానీ సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 25,300-25,500 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

గమనిక..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టేముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.



మదుపుతోనే గెలుపు



నేడు మనం చేసే పొదుపు, పెట్టుబడులే రేపు మన భవిష్యత్తుకు రక్షణనిస్తాయి. దీర్ఘకాలంలో ఆర్థిక క్రమశిక్షణకు ఇవే సోపానాలు. ముఖ్యంగా మన ఆర్థిక లక్ష్యాల సాధనకు పెట్టుబడులే కీలకం. తెలివైన నిర్ణయాలతో చక్కని రాబడులను అందుకోవచ్చు. మరి ఇందుకున్న అవకాశాలు ఏమిటి? ఎలా ముందుకెళ్తే వాటిని సద్వినియోగం చేసుకోవచ్చు?

డైరెక్ట్ ఈక్విటీ

స్టాక్స్‌లో పెట్టే పెట్టుబడులనే డైరెక్ట్ ఈక్విటీ అంటారు. ఏదైనా కంపెనీ షేర్లను మీరు కొన్నట్లైతే.. అందులో మీకు పాక్షికంగా యాజమాన్య హక్కులు వచ్చినట్టే. ఇక ఈ పెట్టుబడులకు స్టాక్ ఎక్స్ఛేంజీలు వేదికలవుతాయి. డీమ్యాట్ ఖాతాల ద్వారా షేర్ల క్రయవిక్రయాలను చేయవచ్చు. అయితే స్టాక్ మార్కెట్ పెట్టుబడులు అనేక అంశాలకు ప్రభావితమై ఉంటాయి. కాబట్టి ఈ ఇన్వెస్ట్‌మెంట్స్ రిస్కులతో ముడిపడి ఉంటాయి. అందుకే మార్కెట్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలి.

మ్యూచువల్ ఫండ్స్

మ్యూచువల్ ఫండ్స్ సంస్థల గురించి నేటి తరం ఇన్వెస్టర్లకు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మన పెట్టుబడులను స్టాక్ మార్కెట్లతోపాటు డెట్, హైబ్రిడ్ ఫండ్స్ తదితర రకరకాల సాధనాల్లో మదుపు చేస్తాయి. దీర్ఘకాలిక మదుపునకు మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు లాభదాయకం. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్)తో ప్రారంభం బాగుంటుంది. అయితే ఇవి కూడా రిస్క్‌తో కూడుకున్నవే. సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదివి ముందుకెళ్లాలి.

ఫిక్స్‌డ్ డిపాజిట్లు

బ్యాంకులు, ఇతర ఫైనాన్షియల్ సంస్థలు ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)ను ఆఫర్ చేస్తాయి. ఇవి సురక్షిత పెట్టుబడులు అని చెప్పవచ్చు. రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల ఆధారంగా డిపాజిటర్లకు వడ్డీ అదాయం ఉంటుంది. పన్ను మినహాయింపులు లభిస్తాయి. ప్రధానంగా సీనియర్ సిటిజన్లకు అనువైనవి. వీటికి లాకిన్ పీరియడ్ ఉంటుంది.

రికరింగ్ డిపాజిట్లు

రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ) కూడా మరో ఫిక్స్‌డ్ టెన్యూర్ ఇన్వెస్ట్‌మెంట్. బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఈ పెట్టుబడులకు అవకాశం ఉంటుంది. నెలనెలా చిన్నచిన్న మొత్తాలతో మదుపునకు వీలుంటుంది. పెట్టుబడికి రక్షణ, గ్యారంటీడ్ ఇన్‌కమ్ వీటి సొంతం.

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్

ఇదో దీర్ఘకాలిక పన్ను ఆదా పెట్టుబడి. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)కు లాకిన్ పీరియడ్ 15 ఏండ్లు. కేంద్ర ప్రభుత్వం హామీ ఉంటుంది. ప్రతీ మూడు నెలలకోసారి వడ్డీరేట్లను కేంద్రం నిర్ణయించి ప్రకటిస్తుంది.

ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్

ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్).. వేతన జీవులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపులు లభిస్తాయి. ఇందులో జమయ్యే నిధులకు అధిక వడ్డీరేటు లభిస్తుంది. కాబట్టి వీటిని ఉపసంహరించుకోకుండా కాపాడుకోవడం కూడా మంచి పెట్టుబడి కిందకే వస్తుంది.

నేషనల్ పెన్షన్ సిస్టమ్

పీపీఎఫ్, ఈపీఎఫ్‌లతో పోల్చితే నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో పెట్టుబడిదారులు అధిక రాబడులను పొందవచ్చు. పన్ను ప్రోత్సాహకాలుంటాయి. అయితే ఈ పథకాన్ని ఎంచుకొంటే రిటైర్మెంట్‌దాకా లాకిన్ పీరియడ్ ఉంటుంది. అయినప్పటికీ నిబంధనలకు లోబడి 40 శాతం వరకు నిధులను వెనక్కి తీసుకోవచ్చు. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్‌పీఎస్ సబ్‌స్క్రిప్షన్ తప్పనిసరిగా ఉన్నది.

కొంచెం కొత్తగా ఆలోచిద్దాం..

రోజులు మారిపోయాయి. ఒకప్పటితో పోల్చితే మదుపరులకు పెట్టుబడికున్న అవకాశాలూ పెరిగిపోయాయి. సంప్రదాయ పెట్టుబడుల స్థానంలో ఇప్పుడు హైటెక్ పెట్టుబడులు వస్తున్నాయి. నేటి తరం వీటిపై మరింతగా దృష్టి సారిస్తే గొప్ప ప్రయోజనాలనే అందుకోవచ్చు. మరి వాటిలో..

ఏఐ ఆధారిత ఈటీఎఫ్‌లు

ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)ల్లో పెట్టుబడుల ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్, ఆటోమేషన్ తదితర నయా టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్స్ వైపునకు అడుగులు వేయవచ్చు. ఇప్పుడున్న పరిస్థితుల్లో భవిష్యత్తు అంతా వీటిదేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కాబట్టి ఏఐ ఫోకస్డ్ ఈటీఎఫ్‌లను ఎంచుకోవడం ఉత్తమమే.

క్రిప్టో సిప్స్

బిట్‌కాయిన్ వంటి ప్రధాన క్రిప్టోకరెన్సీల్లో సిస్టమ్యాటిక్ మంత్లీ ఇన్వెస్ట్‌మెంట్స్ (సిప్).. యువతరానికి బాగా కలిసిరాగలవని మెజారిటీ నిపుణుల అంచనా. దీర్ఘకాలంలో సంపద సృష్టికీ ఇవి దోహదం చేయగలవు.

గ్రీన్ బాండ్లు, డిజిటల్ గోల్డ్

రెన్యువబుల్ ఎనర్జీ, సస్టెయినబుల్ ప్రాజెక్టుల్లో ఫండింగ్ చేసే గ్రీన్ బాండ్లనూ మదుపరులు తమ పెట్టుబడులకు ఎంచుకోవచ్చు. అలాగే యూపీఐ యాప్స్ ద్వారా సూక్ష్మ పెట్టుబడులనూ అనుసరించవచ్చు. పీర్-టు-పీర్ లెండింగ్ సాధనాలనూ పరిశీలించవచ్చు.

- 'పేట' మున్సిపాలిటీలో సమస్యలు తిష్ట
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజానీకం
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

హోదా ఉంది.. అధికారులు లేరు

మున్సిపాలిటీ అయితే సమస్యలకు తక్షణ పరిష్కారం, అభివృద్ధి వేగవంతమవుతుందని భావించిన ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. అశ్వారావుపేట మేజర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా మార్చిన కాంగ్రెస్ సర్కార్ హోదా ఇచ్చింది.. కానీ అందుకు అవసరమైన అధికారులను మాత్రం నియమించలేదు. దీంతో 'పేట' మున్సిపాలిటీలో సమస్యలు తిష్ట వేసుకుని కూర్చున్నాయి.. నిధులు సైతం లేకపోవడంతో అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఫలితంగా సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీస సిబ్బంది లేక పాలన చతికిలాపడింది. మున్సిపాలిటీ కంటే గ్రామ పంచాయతీ పాలనే మెరుగు అన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. మున్సిపల్ హోదా వచ్చినా ప్రయోజనం ఏమిటని పెదవి విరుస్తున్నారు.

- అశ్వారావుపేట, జూన్ 1

అశ్వారావుపేట పట్టణం

తాగునీటి కోసం ఆందోళన చేస్తున్న మహిళలు (ఫైల్)

గిరిజన నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేట మేజర్ గ్రామ పంచాయతీని రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీగా మార్చింది. కానీ కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీకి సిబ్బందిని ఇప్పటివరకు నియమించలేదు. దీనివల్ల ప్రజలకు సమస్యలు పరిష్కారం కాకపోవటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అశ్వారావుపేట, పేరాయిగూడెం, గుర్రాలచెరువు గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మున్సిపాలిటీగా ఏర్పడి తర్వాత సమస్యలు పరిష్కారం కావడం లేదు. పాలనాపరమైన పర్యవేక్షణకు ప్రభుత్వం పాల్వంచ మున్సిపల్ కమిషన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది. వీరితోపాటు ఇతర ప్రాంతాల్లో పని చేస్తున్న మరో ముగ్గురు అధికారులను ఇన్‌చార్జ్‌లుగా నియమించింది. పాలకవర్గాల ఎన్నికల నిర్వహించకపోవటంతో వరంగల్‌కు చెందిన ఆర్‌డీఎంఏను ప్రత్యేకాధికారిగా నియమించింది. ఇతర సిబ్బంది ప్రాధాన్యతను నిర్లక్ష్యం చేయటంతో పాలన సక్రమంగా సాగటం లేదు.

ఈ అధికారులు కావాలి :

కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీ గ్రేడ్-3 పరిధిలో ఉంటుంది. అయినా పాలనాపరంగా ఒక కమిషనర్, మేనేజర్/రెవెన్యూ ఆఫీసర్, టీపీవో(టౌన్ ప్లానింగ్ ఆఫీసర్), జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్, డీఏ, ఏఈ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, బిల్ కలెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్, సీనియర్ స్టెనోగ్రాఫర్, జూనియర్ స్టెనోగ్రాఫర్, వార్డు ఆఫీసర్లు ఉండాలి. కానీ ఈ పోస్ట్‌లను మంజూరు చేయకుండా కేవలం మున్సిపల్ హోదా కల్పిస్తూ ఫిబ్రవరి 4న ఉత్తర్వులు జారీ చేసింది. పన్నులు వసూలు, ఇతర అవసరాల కోసం తాత్కాలికంగా పాల్వంచ మున్సిపల్ కమిషన్ కె.సుజాతను, టీపీవోగా సత్తుపల్లి మున్సిపల్‌లో పనిచేస్తున్న వి.శ్రీనివాసరావు, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా సత్తుపల్లి కార్యాలయం నుంచి కిరణ్‌కుమార్, పాల్వంచ నుంచి ఏఈగా రాముని ఇన్‌చార్జ్‌లుగా నియమించింది. ఇక పాలకవర్గం లేకపోవటంతో వరంగల్ రీజనల్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ షాహిద్ మసూద్‌కు ప్రత్యేక అధికారి బాధ్యతలు అప్పగించింది. సుమారు 4 నెలలు అవుతున్నా ఒక్కసారి కూడా ప్రత్యేకాధికారి అశ్వారావుపేట రాలేదు. మిగతా సిబ్బంది నియామకాన్ని మరిచింది. ఫలితంగా మున్సిపల్ సేవలు అందుబాటులో లేకపోవడంతో పాలన దిగజారుతున్నది.

సమస్యల పరిష్కారం అంతంతమాత్రమే..

మున్సిపాలిటీలో ప్రజా సమస్యల పరిష్కారం అంతంతమాత్రంగానే ఉంది. పన్నులు వసూలు చేస్తున్నంత స్పీడ్‌గా సమస్య పరిష్కారంలో కనిపించటం లేదు. ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్య నిర్వహణలో అధికారులు విఫలమవుతున్నట్లు కనిపిస్తున్నది. ఈ నెల 22వ తేదీన మున్సిపల్ పరిధిలోని మారుతీనగర్ మహిళలు తాగునీటి కోసం రోడ్డెక్కారు. ప్రతిరోజూ సరఫరా అవుతున్న తాగునీటిలో పురుగులు ప్రత్యక్షమవుతున్నాయి. దీంతో నీటిని వడ కట్టుకుని వాడుకుంటున్నారు. ఇక పారిశుధ్యం కూడా అంతే తీరులో కనిపిస్తున్నది. ఇంటి నెంబర్ల కేటాయింపు, యాజమాని పేరు మార్పు కోసం రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తున్నది. ఇందుకు ప్రధాన కారణం పూర్తిస్థాయి సిబ్బంది లేకపోవటమేనని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. హోదా కల్పించిన ప్రభుత్వం సిబ్బందిని కూడా పూర్తి స్థాయిలో నియమించి మున్సిపల్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామ పంచాయతీ కంటే హీనం..

కొత్తగా ఏర్పడిన అశ్వారావుపేట మున్సిపాలిటీ సేవలు గ్రామ పంచాయతీ పాలన కంటే హీనంగా ఉన్నాయి. సమస్యలకు పరిష్కారం సకాలంలో అందటం లేదు. పట్టణంలో సరఫరా చేస్తున్న తాగునీటిలో పురుగులు వస్తున్నాయి. వడ కట్టుకుని నీటిని పట్టుకుంటున్నారు. ఈ వ్యవహారం సోమవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. గుర్రాలచెరువు గ్రామంలో కొద్దిరోజుల క్రితం తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సిబ్బందిని నియమించి ప్రజలకు పూర్తిస్థాయి సేవలు అందించాలి.

– జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, మాజీ ఎంపీపీ, అశ్వారావుపేట

పోస్టులు మంజూరు కాలేదు

అశ్వారావుపేటకు మున్సిపల్ హోదా వచ్చింది.. కానీ పోస్టులు ఇంకా మంజూరు కాలేదు. పాలనాపరమైన ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం సమీప ప్రాంతాల్లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులను ఇన్‌చార్జ్‌లుగా నియమించింది. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పాలన సాగిస్తున్నాం.

– కె.సుజాత, మున్సిపల్ కమిషనర్, అశ్వారావుపేట

ఆయిల్‌పాం గెలల ధర.. భారీగా తగ్గింపు

- ఆవిర్భావోత్సవం వేళ రైతులకు నిరాశ మిగిల్చిన సర్కారు
- ఒక్కో టన్నుకు ఏకంగా రూ.1,310 కోల్పోతున్న రైతులు
- ఏప్రిల్ నెలలో రూ.20,058.. మే నెలలో రూ.18,748..

అశ్వారావుపేట ఫ్యాక్టరీ ఎదుట దిగుమతి అయి ఉన్న ఆయిల్‌పాం గెలలు (ఫైల్)

అశ్వారావుపేట, జూన్ 1: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం వేళ తెలంగాణ ఆయిల్‌ఫెడ్ చేదు కబురు ప్రకటించింది. ఆయిల్‌పాం రైతులకు నిరాశను మిగిల్చింది. ఆయిల్‌పాం గెలల ధరను భారీగా తగ్గిస్తూ ఆదివారం సంస్థ నిర్ణయం తీసుకుంది. 2025 ఏప్రిల్ నెలలో టన్ను గెలల ధరను రూ.20,058గా ప్రకటించిన సర్కారు.. మే నెలకు ధర రూ.18,748కు తగ్గించింది. దీంతో రైతులు టన్ను గెలల ధరలో ఏకంగా రూ.1,310 కోల్పోతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల దృష్ట్యా ధర తగ్గినట్లు ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ టీ.సుధాకర్ రెడ్డి తెలిపారు. తగ్గిన ధర మే నెలలో ఫ్యాక్టరీకి తరలించిన గెలలకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు.

ఖమ్మం పరేడ్ గ్రౌండ్‌లో..

నేడు తెలంగాణ అవతరణ వేడుకలు

- జాతీయ పతాకావిష్కరణ చేయనున్న డిప్యూటీ సీఎం భట్టి
- వేడుకల సందర్భంగా నేటి గ్రీవెన్స్ రద్దు: ఖమ్మం కలెక్టర్

మామిళ్లగూడెం, జూన్ 1: తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను ఖమ్మం నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇక్కడ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలు ప్రారంభిస్తారని అన్నారు. అనంతరం జిల్లా అభివృద్ధిపై సందేశమిస్తారని తెలిపారు. తరువాత సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆ తరువాత అభివృద్ధి, సంక్షేమ పథకాలపై స్టాళ్ల ప్రదర్శన ఉంటుందన్నారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు గ్రీవెన్స్‌డే రద్దు..

కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డేను రద్దు చేసినట్లు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అవతరణ వేడుకల్లో అధికారులు, ప్రజలు భాగస్వాములవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకునట్లు చెప్పారు.

అవతరణ వేడులకు.. ప్రకాశం స్టేడియం ముస్తాబు

ఏర్పాట్లు పూర్తి చేసిన సింగరేణి యాజమాన్యం

సభా వేదిక, ప్రకాశం స్టేడియం గ్రౌండ్‌ను ముస్తాబు చేస్తున్న దృశ్యాలు

కొత్తగూడెం సింగరేణి, జూన్ 1: తెలంగాణ రాష్ట్ర 11వ అవతరణ దినోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సింగరేణి యాజమాన్యం సర్వం సిద్ధం చేసింది. సింగరేణి వ్యాప్తంగా సోమవారం ఈ వేడుకలు అట్టహాసంగా జరగనున్నాయి. ఈ వేడుకల్లో సీఎండీ బలరాం ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఉదయం 9 గంటలకు ప్రధాన కార్యాలయంలో సీఎండీ జెండా ఆవిష్కరణ చేస్తారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేస్తారు. తరువాత ప్రకాశం స్టేడియం నుంచి బస్టాండ్ సెంటర్ అమరవీరుల స్తూపం వరకు తెలంగాణ రన్ నిర్వహిస్తారు. అక్కడ అమరవీరులకు నివాళులర్పిస్తారు. తరువాత ప్రకాశం స్టేడియం లోనూ ఉదయం 9:15 గంటలకు సీఎండీ జెండా ఆవిష్కరణ చేస్తారు. తర్వాత ఎస్అండ్‌పీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ సమర్పించే గౌరవ వందనం స్వీకరించి సందేశం ఇస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి ప్రకాశం స్టేడియంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేయాలని అధికారులు కోరారు.